RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 23 డిసెంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 224 | పేజీలు: 4 | వెల: రూ.5/-




## అంగీకార శృంగారం రేప్ కాదు

వేధింపుల కోసం చట్టాన్ని వాడుకోవద్దు

ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు

2



# అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

### తీవ్ర ఉద్రిక్తత-భారీగా పోలీసుల మోహరింపు

### అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు విసిరిన ఓయూ జేఏసీ నాయకులు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి వెంటనే రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు నిరసనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీగా మోహరించారు. ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న ఆయన మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. జరిగిన రాళ్ల దాడిపై సెక్యూరిటీ సిబ్బంది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

సంయమనం పాటించాలి : అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిపై ఆయన తండ్రి అల్లు అరవింద్ స్పందించారు. "మా ఇంటి ముందు జరిగిన ఘటన మీరంతా చూశారు. ఇలా ఎవరికీ జరగకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ సమయనం పాటించాలి అదే మంచిది. తొందరపడి చర్యలకు దిగొద్దు" అని అల్లు అరవింద్ తెలిపారు. ఈ రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని మీడియా ప్రశ్నకు అల్లు అరవింద్ స్పందించకుండా వెళ్లిపోయారు.



## అల్లు అర్జున్ సీఎంకు క్షమాపణ చెప్పాలి

### సినీ ఇండస్ట్రీ పెద్దలపై మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

### అల్లు అర్జున్‌పై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన సంచలనం రేకెత్తించగా.. శనివారం అసెంబ్లీలో అల్లు అర్జున్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇది హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడి.. అల్లు అర్జున్, సినీ ఇండస్ట్రీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఐకాన్ స్టార్ ప్రెస్ మీట్‌పై

..మిగతా 2లో




# ఈసీ కొత్త రూల్స్!

### ఇకపై పోలింగ్ సీసీ టీవీ ఫుటేజ్ చెక్ చేసేందుకు నో ఛాన్స్

### సీసీ కెమెరాల వీడియోలు, వెబ్‌కాస్టింగ్ బహిరంగపరచకుండా చర్యలు

### అభ్యర్థులపై వీడియో రికార్డింగుల వెల్లడీ నిషేధం

### నిబంధనల్లో ఈసీ మార్పులు

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం (ఈసీ) మార్పులు చేసింది. ఇక నుంచి పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్ కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. ఎన్నికల్లో పారదర్శకతకు ఇది విఘాతమని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ సవరణకు ఓ కోర్టు కేసు కారణమని ఈసీతోపాటు న్యాయశాఖ వేర్వేరుగా వివరణ ఇచ్చాయి. కొత్త సవరణతో ఎలక్ట్రానిక్ రికార్డులు మినహా ఇతర పత్రాలు, డాక్యుమెంట్లు తనిఖీకి అందుబాటులో ఉంటాయి. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని

..మిగతా 2లో

## ఈసీ సమగ్రతను దెబ్బతీస్తున్నారు

కేంద్రంపై మల్లికార్జున ఖర్గే ఫైర్

2



అల్లు అర్జున్ సినీ హీరో కావొచ్చు,

## కానీ ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం:

తెలంగాణ డీజీపీ

2



## అల్లు అర్జున్ చెప్పిందంతా అబద్ధమేనా?

సంచలన విషయాలు వెల్లడించిన పోలీసులు

అల్లు అర్జున్‌పై సీపీ కామెంట్స్

2

# మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

### ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరు దేశాలు ఫోకస్

### భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మరో అరుదైన గౌరవం

### తమ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించిన కువైట్ రాజు

కువైట్, (ప్రభాత సూర్యుడు): కువైట్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ ద గ్రేట్' అందుకున్నారు. కువైట్ రాజు షేక్ మేషాల్ అల్-అహ్మద్ అల్-జబేర్ అల్-సబా ఈ అవార్డు అందజేశారు. అనంతరం రెండు దేశాల మధ్య సంబధాలు బలోపేతం చేసేలా ఇరువురు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతంతోపాటు ఫార్మా, ఐటీ, ఫిన్‌టెక్, సెక్యూరిటీ. ఇంధనరం వంటి కీలక రంగాల్లో సహకారంపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ' ఇది అద్భుతమైన భేటీ. ఇరుదేశాల మధ్య

..మిగతా 2లో



## రాహుల్ గాంధీకి బిగ్ షాక్

### యూపీ కోర్టు సమన్లు



న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి బిగ్ షాక్ తగిలింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కులగణనపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గాను ఉత్తరప్రదేశ్‌లో బరేలీ జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసింది. జనవరి 7న కోర్టులో హాజరుకావాలని పేర్కొంది. ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై పంకజ్ పాఠక్ అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ వేశారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు దేశంలో విభజన, అశాంతిని ప్రేరేపించే అవకాశం ఉందని..

..మిగతా 2లో



చదరంగంలో చంద్రబాబు మనవడు

## దేవాన్ష్ ప్రపంచ రికార్డు

### ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధృవీకరణ పత్రాన్ని అందుకున్న దేవాన్ష్

### హర్షం వ్యక్తం చేసిన నారా కుటుంబం

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాన్ష్ చదరంగం లో ప్రపంచ రికార్డ్ సృష్టించారు. వేగంగా పావులు కదపడంలో నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు నెలకొల్పారు. 9 ఏళ్ల నారా దేవాన్ష్ "వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్ - 175 పజిల్స్" ప్రపంచ

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# వడ్డీతో సహా ఆ డబ్బులు కట్టండి..

## వర్మకు ఏపీ సర్కారు షాక్



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ రోజుకో రకంగా వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై అభ్యంతరకర పోస్టల కేసులో హైకోర్టులో ఆయన ఊరట లభించింది. కానీ, ఇప్పటికే వ్యూహం సినిమాలో పలువురు టీడీపీ నేతల ఫోటోలు ఉపయోగించి వ్యంగంగా చూపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కానీ రామ్ గోపాల్ వర్మ మాత్రం ఈ కేసు విచారణకి హాజరు కావడం లేదు. అయితే, ఈ కేసుని మరింత లోతుగా విచారిస్తోంది ఏపీ ప్రభుత్వం. ఈ క్రమంలో మరోసారి రామ్ గోపాల్ వర్మకి కూటమి సర్కారు షాక్ ఇచ్చింది. వ్యూహం సినిమాని ఏపీలో ప్రసారం చెయ్యడానికి ఏపీ ఫైబర్ నెట్‌కు విక్రయించగా.. ఈ క్రమంలో సినిమాకి వ్యూస్ లేకపోయినా రూ. 1.15 కోట్లు చెల్లించినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వం వ్యూహం చిత్ర యూనిట్ ఈ సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. ఒకవేళ 15 రోజుల్లో ఈ డబ్బు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది




## చదరంగంలో చంద్రబాబు మనవడు
# దేవాన్ష్ ప్రపంచ రికార్డు

మొదటి పేజీ తరువాయి...

రికార్డు కైవసం చేసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధృవీకరణను దేవాన్ష్ అందుకున్నారు. దేవాన్ష్ ఘనత పట్ల నారా కుటుంబం హర్షం వ్యక్తం చేస్తోంది.

"చెక్‌మేట్ మారథాన్" పేరుతో ప్రపంచ రికార్డు: వ్యూహాత్మకమైన ఆటతీరు, థ్రిల్లింగ్ ప్రదర్శనతో యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ "చెక్‌మేట్ మారథాన్" పేరుతో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. ఈ రికార్డులో దేవాన్ష్ క్రమక్రమంగా సవాలు చేసే చెక్‌మేట్ పజీళ్ల క్రమాన్ని పరిష్కరించాడు. ప్రసిద్ధ చెస్ సంకలనం నుంచి ఎంపిక చేసిన 5334 సమస్యలు, కలయికల ద్వారా ఈ పోటీని రూపొందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వంతో దేవాన్ష్ ఈ రికార్డును సాధించగలిగాడు. ఇటీవల దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా సాధించాడు. అతను 7 డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం 1నిమిషం 43సెకన్లలో పూర్తి చేసాడు. 9 చెస్ బోర్డ్‌లను కేవలం 5 నిమిషాల్లో అమర్చాడు. మొత్తం 32 ముక్కలను వేగవంతంగా సరైన స్థానాల్లో ఉంచాడు. దేవాన్ష్ ప్రపంచ రికార్డు ప్రయత్నాలను న్యాయనిర్ణేతలు, లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టుదల, కృషి ద్వారా తమ కలలను సాధించవచ్చని దేవాన్ష్ నిరూపించాడు. ఇది భారతీయ పిల్లల అపారమైన ప్రతిభకు, వారిలో దాగివున్న అత్యుత్తమ నైపుణ్యాలకు మచ్చుతునక. సరైన ఎక్స్‌పోజర్, మార్గదర్శకత్వంతో పిల్లలు ఉన్నతస్థానానికి చేరుతారనడానికి దేవాన్ష్ నిదర్శనమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

హర్షం వ్యక్తం చేసిన లోకేశ్: దేవాన్ష్ లేజర్ షార్ప్ ఫోకస్‌తో శిక్షణ పొందడం తాను ప్రత్యక్షంగా చూశానని తండ్రి, రాష్ట్ర మంత్రి లోకేష్ ఈ ఘనత పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేవాన్ష్ ఈ క్రీడను ఎంతో ఇష్టంగా స్వీకరించాడని తెలిపారు. అతను గ్లోబల్ అరేనాలో భారతీయ చెస్ క్రీడాకారుల అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడని వెల్లడించారు. దేవాన్ష్ కు చెస్ పాఠాలు నేర్పిన రాయ్ చెస్ అకాడమీకి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఈవెంట్ కోసం దేవాన్ష్ గత కొన్ని వారాలుగా రోజుకు 5-6 గంటల పాటు శిక్షణ పొందుతున్నాడన్నారు. దేవాన్ష్ సృజనాత్మకంగా చెస్ నేర్చుకునే ఒక డైనమిక్ విద్యార్థి అని ఆయన కోచ్ కె. రాజశేఖర్ రెడ్డి చెప్పారు. 175 సంక్లిష్టమైన పజిల్స్‌ని ఆసక్తిగా పరిష్కరించగలిగిన మానసిక చురుకుదనం దేవాన్ష్ సొంతమని తెలిపారు. అతని చదరంగం ప్రయాణంలో ఇదొక మైలురాయి అని వెల్లడించారు.

# మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

మొదటి పేజీ తరువాయి...

సంబంధాలు మరింత బలపడటానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాం. ఇరుదేశాల మధ్య సాధారణ భాగస్వామ్యాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాం.' అని మోదీ వెల్లడించారు. ఆ తర్వాత కువైట్ యువరాజు షేక్ సబా అల్-ఖలీద్ అల్-సబాతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్యం సహా కీలకరంగాల్లో ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతంపై చర్చలు జరిపారు. భారత్‌కు చెందిన అగ్రశ్రేణి వ్యాపార భాగస్వాముల్లో కువైట్ ఒకటి కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 10.47 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందు ప్రధాని మోదీ కువైట్ రాజప్రసాదం వద్ద అధికారిక స్వాగతంతోపాటు గార్డ్ ఆఫ్ హానర్ అందుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం కువైట్ చేరుకున్న ప్రధాని మోదీ మొదటిరోజు ప్రవాస భారతీయులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం భారతీయ కార్మికుల శిబిరాన్ని సందర్శించి, వారితో కొంచెం సేపు ముచ్చటించారు. గత 43 ఏళ్లలో భారత ప్రధాని కువైట్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీకి లభించిన 20వ అంతర్జాతీయ పురస్కారం ఇది. స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలకు, రాజకుటుంబ సభ్యులకు కువైట్ ఈ పురస్కారం అందజేస్తుంది. గతంలో అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ బుష్ తదితరులు దీన్ని అందుకున్నారు.

# అంగీకార శృంగారం రేప్ కాదు

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): పరస్పర అంగీకారంతో జరిగిన శృంగారాన్ని లైంగిక దాడిగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. చట్టంలోని సెక్షన్లను కొందరు పురుషులను వేధించేందుకు ఉపయోగిస్తున్నారని స్పష్టం చేసింది. తనపై నమోదైన రేప్ కేసును కొట్టివేయాలంటూ ఓ యువకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ చంద్రధారి సింగ్‌తో కూడిన ధర్మాసనం యువతి ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టినట్టు స్పష్టమవుతున్నదని పేర్కొంది. ఈ మేరకు యువకుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ, తీర్పు సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యాచారం మహిళలపై జరిగే చాలా హేయమైన చర్య. కానీ కొందరు మహిళలు తమతో సంబంధం కలిగిన పురుషుడిని వేధించేందుకు చట్టాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. యువకుడు సమర్పించిన వాట్సప్ చాటింగ్‌లు, రికార్డింగ్స్ బట్టి చూస్తే ఇద్దరూ పరస్పరం అంగీకారంతోనే శారీరక బంధంలోకి ప్రవేశించినట్టు స్పష్టమవుతున్నది. స్త్రీలు చట్టాన్ని దుర్వినియోగం చేయడం వల్ల పురుషులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో చెప్పేందుకు ఈ కేసు స్పష్టమైన ఉదాహరణ. ఇలాంటి కేసుల్లో ఫిర్యాదుదారుల ఉద్దేశాలను కూడా కోర్టులు పరిశీలించాలి. అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది యువకుడిపై యువతి తీవ్రమైన ఆరోపణలు చేశారని, కేసును కొట్టివేయవద్దని కోరారు. స్పందించిన న్యాయమూర్తి ఆధారాల ప్రకారం చూస్తే ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ కులాలు వేర్వేరు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోయినా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమని యువకుడు తెలిపాడు. కానీ ఆమె మరో యువకుడితో పెళ్లికి అంగీకరించడంతో ప్రేమించిన యువకుడితో పెళ్లికి ఆసక్తి చూపలేదు అని న్యాయమూర్తి తెలిపారు. అందువల్ల యువకుడిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దురుద్దేశపూర్వకమైనదేనని, కాబట్టి కేసు చెల్లదని స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీకి బిగ్ షాక్

మొదటి పేజీ తరువాయి...

న్యాయపరంగా జోక్యం తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆరోపిస్తూ పిటిషన్‌లో పేర్కొన్నారు. ముందుగా ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై విచారణ తిరస్కరణకు గురైంది. ఆ తర్వాత ఆయన జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం రాహుల్‌గాంధీకి నోటీసులు పంపించింది. ఇదిలాఉండగా.. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఆర్థిక, సంస్థాగత సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు చెందినవారు ఎంతమంది ఉన్నారో తెలుసుకునేందుకు మొదటగా కులగణన నిర్వహిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఆర్థిక, సంస్థాగత సర్వే నిర్వహిస్తామని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలపైనే పిటిషనర్ కోర్టుకు వెళ్లినట్లు జాతీయ మీడియా వెల్లడించింది.

# అల్లు అర్జున్ సీఎంకు క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి...

ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డికి బన్నీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన ఇమేజ్ దెబ్బతీశారంటూ సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదన్నారు.

### 'మానవత్వం లేకుండా ఉంటారా.?'

'ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదని అల్లు అర్జున్ అనడం హాస్యాస్పదం. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారు. ఇది పద్ధతి కాదు. అల్లు అర్జున్ పర్మిషన్ లేకుండా థియేటర్‌కు వెళ్లాడు. మా వద్ద అన్ని ఆధారాలున్నాయి. బన్నీ కామెంట్స్ సీఎంను అగౌరవపరిచే విధంగా ఉన్నాయి. వాటిని వెనక్కి తీసుకోవాలి.' అని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్‌ను చిరంజీవి ఎందుకు పరామర్శించట్లేదని ఆయన ప్రశ్నించారు. సినిమా ఇండస్ట్రీ వాళ్లు మొత్తం ఇలాగే మానవత్వం లేకుండా ఉంటారా.? అంటూ నిలదీశారు. తెలంగాణలో ఇక బెనిఫిట్ షోలు ఉండవంటూ స్పష్టం చేశారు. అటు, శనివారం తెలంగాణ అసెంబ్లీ ముగిసిన వెంటనే మంత్రి కోమటిరెడ్డి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. బాలుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం రేవతి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అటు, రేవతి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. మరోవైపు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అల్లు అర్జున్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలను తప్పుపట్టేలా బన్నీ వ్యవహరిస్తున్నారని.. ఆయన తీరు దారుణంగా ఉందని అన్నారు. 'అల్లు అర్జున్‌లో కనీసం పశ్చాత్తాపం కనిపించట్లేదు. రేవతి కుటుంబంపై సానుభూతి చూపించలేదు. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తెచ్చిన ప్రస్తావనపైనే సీఎం స్పందించారు. పోలీసులు చెప్పినా వినకుండా అల్లు అర్జున్ థియేటర్‌లో షో చేశారు. ప్రాణాల కంటే పేరు ప్రతిష్టలు ఎక్కువా.?' అంటూ నిలదీశారు.

### సీఎం రేవంత్ వ్యాఖ్యలివే.!

కాగా, సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు హీరో అల్లు అర్జున్ రావడమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా.. దీనికి అసెంబ్లీలో సీఎం సమాధానమిచ్చారు. ఓ హీరో తన సినిమా చూసేందుకు థియేటర్‌కు రావడంతో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు చావుబతుకుల మధ్య ఉన్నాడని.. ఆ సమయంలోనూ నటుడు వాహనం రూఫ్ టాప్ నుంచి ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తూ వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, బాధ్యులైన థియేటర్ యాజమాన్యంతో పాటు హీరోపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ఈ వ్యాఖ్యలను బన్నీ తప్పుపట్టారు.

## అల్లు అర్జున్ సినీ హీరో కావొచ్చు,
## కానీ ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం:

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అల్లు అర్జున్ సినిమా హీరో అయి ఉండొచ్చు, కానీ ఓ పౌరుడిగా బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. అల్లు అర్జున్‌కి మేం వ్యతిరేకం కాదు. కానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే చట్టప్రకారం యాక్షన్ తీసుకుంటాం. థియేటర్ వద్ద ఆ రోజు జరిగిన సంఘటన దురదృష్టకరం అన్నారు.

### నటీనటులు పరిస్థితులు అర్థం చేసుకోవాలి

కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రాన్ని డీజీపీ జితేందర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ఎవరికీ వ్యతిరేకం కాదు. పౌరుల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. అల్లు అర్జున్ సినిమా హీరో కావొచ్చు. బయట మాత్రం ఆయన ఓ సాధారణ పౌరుడు. ప్రతి పౌరుడు తమ వంతుగా బాధ్యతాయుతంగా ప్రవర్తించడం ఎంతైనా అవసరం. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థం చేసుకుని మసలుకోవాలి. సినిమా ప్రమోషన్లు, ఈవెంట్ల కంటే మాకు ప్రజల భద్రతే ముఖ్యం. ప్రజల ప్రాణాల కంటే సినిమా ఈవెంట్లు ముఖ్యమైన విషయం కాదు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరిపై అయినా చర్యలు తప్పవు. అల్లు అర్జున్‌కు తాము వ్యతిరేకం కాదని' స్పష్టం చేశారు.

సినిమా నటులైనప్పటికీ బయట వీరు సాధారణ పౌరుల్లా వ్యవహరించాలి. సినీ నటుడు మోహన్ బాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన విషయం కుటుంబ సమస్య కానీ, జర్నలిస్టుపై దాడితో మోహన్ బాబుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. పరిమితులకు లోబడి, పరిస్థితిని అర్థం చేసుకుని వ్యవహరిస్తే ఎవరికీ ఏ సమస్యా ఉండదు. లేనిపక్షంలో కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. - తెలంగాణ డీజీపీ

### మధ్యంతర బెయిల్ రావడంతో అల్లు అర్జున్ విడుదల

సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4న తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. కొన్ని రోజుల కిందటితో పోల్చితే బాలుడి పరిస్థితి కొంచెం మెరుగైందని హాస్పిటల్ శనివారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. చిక్కడపల్లి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి అల్లు అర్జున్ సహా కొందరు నిందితుల్ని అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెండు వారాల రిమాండ్ విధించగా చంచల్ గూడ జైలుకు తరలించారు

# అల్లు అర్జున్ చెప్పిందంతా అబద్ధమేనా..?

## సంచలన విషయాలు వెల్లడించిన పోలీసులు
## సంధ్య థియేటర్ ఘటన
## అల్లు అర్జున్‌పై సీపీ కామెంట్స్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సంధ్య థియేటర్ ఘటనపై శనివారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌తో ఈ వ్యవహారం మరోసారి తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాఫిక్‌గా మారింది. అల్లు అర్జున్ అత్యుత్సాహం, పోలీసుల మాట వినకపోవటం వల్లే రేవతి అనే మహిళ చనిపోవటమే కాకుండా ఆమె కుమారుడు చావు బతుకుల మధ్య పోరాడుతున్నారని రేవంత్ అసెంబ్లీ వెల్లడించారు. రేవంత్ కామెంట్లపై అల్లు అర్జున్ సైతం స్పందించారు. శనివారం రాత్రి ప్రెస్‌మీట్ పెట్టిన ఆయన.. సీఎం వ్యాఖ్యలు బాధ కలిగించాయని చెప్పారు. పోలీసులు పర్మిషన్ ఇస్తేనే తాను థియేటర్‌కు వెళ్లాలని.. రేవతి చనిపోయిన విషయం తనకు మర్నాడు తెలిసిందన్నారు.కాగా, అల్లు అర్జున్ చేసిన ఈ కామెంట్లపై తాజాగా హైదరాబాద్ సీపీ కీలక విషయాలు వెల్లడించారు. ఆ రోజు థియేటర్ వద్ద ఏం జరిగిందో మీడియాకు తెలిపారు. అందుకు సంబంధించిన వీడియో దృష్యాలను కూడా మీడియాకు చూపించారు. ప్రత్యక్ష సాక్షి, డ్యూటీలో ఉన్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్ ద్వారా జరిగిన విషయాన్ని వెల్లడించారు. ఏసీపీ రమేష్ ఏం చెప్పారో ఆయన మాటల్లోనే.. 'అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌కు ముందు తెలియజేశాం. ఒక లేడీ చనిపోయారు.. ఓ పిల్లాడు తీవ్ర గాయాల పాలయ్యాడు.. పరిస్థితి కంట్రోల్‌లో లేదని చెప్పాం. మీకు ఇబ్బంది ఉంటుంది అని చెప్పాం. ముందు అల్లు అర్జున్ మేనేజర్ మమ్మల్ని కలవనివ్వలేదు. మేం అల్లు అర్జున్‌కు చెబుతామని సంతోష్ అన్నారు. కానీ వారు వెళ్లలేదు. అదే సమయంలో మా డీసీపీ సార్ వచ్చారు.

డీసీపీ సార్ సూచనతో వాళ్లను నెట్టుకుంటూ నేను అల్లు అర్జున్ వద్దకు వెళ్లాను. అల్లు అర్జున్ చెవిలో చెప్పాను. ఓ లేడీ చనిపోయిదని.. పిల్లాడు గాయపడ్డాడని చెప్పాను. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని.. పోలీసులు రూట్ క్లియర్ చేశామని ఆయనకు చెప్పాం. అయినా అల్లు అర్జున్ వినిపించుకోలేదు. సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు. అప్పుడు మా డీసీపీ సార్‌కు చెప్పాం. అప్పుడు సార్, మేం మరోసారి లోపలికి వెళ్లాం. ఓ 10-15 నిమిషాలు టైం ఇచ్చాం. ఆ తర్వాత ఆయన్ను బయటకు తీసుకొచ్చాం. వాస్తవంగా జరిగింది ఇదే.' అని రమేష్ వెల్లడించారు.

ఇక సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పర్మిషన్ లెటర్‌పై కూడా పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. తాము థియేటర్ యాజమాన్యానికి ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. లెటర్ ఓ వైపు మాత్రమే వైరల్ చేస్తున్నారు. పర్మిషన్ లెటర్ వెనకాలే కుదరని రాసినట్లు స్టేషన్ ఎస్‌ఎచ్‌వో రాజు నాయక్ వెల్లడించారు. తాను ఓరల్‌గా కూడా వారికి పర్మిషన్ లేదని చెప్పినట్లు తెలిపారు. సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. సంధ్య థియేటర్ ఘటనలో ఇంకా ఏం కాలేదని.. ఇక ముందు ఇంకా చాలా ఉందని చెప్పారు. కేసు కోర్టులో ఉన్నందను ఇంతకు మించి వివరాలు వెల్లడించలేమని అన్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఇప్పుడి వరకు అల్లు అర్జున్ చెప్పినదంతా అబద్ధమని.. కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# ఈసీ కొత్త రూల్స్!

మొదటి పేజీ తరువాయి...




తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి. హరియాణా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను మహమ్మద్ ప్రాచా అనే వ్యక్తికి షేర్ చేయాలని ఇటీవల పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఆదేశించింది. రూల్ 93 (2)లో పత్రాలు, డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ రికార్డులనే విభజన లేనందున అన్ని రికార్డులను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే దీనిని ఈసీ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలకు సవరణ చేసింది.

### ఈసీ ఎందుకు భయపడుతోంది? కాంగ్రెస్

అయితే ఎన్నికల నిబంధనను మార్చడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకతకు ఈసీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ, అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.

# పుష్ప 2 సినిమాను ఎంజాయ్ చేస్తున్న స్మగ్లర్

## పోలీసులు ఏం చేశారంటే?

ముంబై: (ప్రభాత సూర్యుడు): డ్రగ్స్ స్మగ్లింగ్‌తోపాటు రెండు హత్యా కేసుల్లో నిందితుడైన వ్యక్తి పుష్ప 2 సినిమా చూస్తూ ఆనందంలో మునిగిపోయాడు. అయితే థియేటర్‌లోకి ప్రవేశించిన పోలీసులు అతడికి షాక్ ఇచ్చారు. వారి కళ్లగప్పి తప్పించుకుని తిరుగుతున్న ఆ నిందితుడ్ని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. గ్యాంగ్‌స్టర్ విశాల్ మేష్రామ్‌పై 27 కేసులున్నాయి. ఇద్దర్ని హత్య చేయడంతోపాటు డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడిన అతడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే గత పది నెలలుగా వారి కళ్లగప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. కాగా, విశాల్ ఇటీవల కొత్త కారు కొన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడి కదలికలపై నిఘా పెట్టారు. హీరో అల్లు అర్జున్ తాజా మూవీ 'పుష్ప 2: ది రూల్' సినిమా చూడటం పట్ల అతడు ఆసక్తి చూపుతున్నట్లు పసిగట్టారు. గురువారం అర్ధరాత్రి వేళ మల్టీప్లెక్స్‌లో ఆ సినిమా చూడటంలో నిమగ్నమైన విశాల్‌కు షాక్ ఇచ్చారు. మరోవైపు థియేటర్‌కు చేరుకున్న పోలీసులు ముందు జాగ్రత్తగా కారు టైర్లలో గాలి తీసేశారు. ఆ తర్వాత సినిమా హాల్‌లోకి ప్రవేశించారు. పుష్ప సినిమా చూడటంలో బిజీగా ఉన్న విశాల్‌ను చుట్టుముట్టి అతడ్ని అరెస్ట్ చేశారు. మిగతా ప్రేక్షకులకు ఇబ్బంది కలుగకుండా వెంటనే అతడ్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. సినిమా సన్నివేశాన్ని తలపించేలా ఉన్న ఇది చూసి ప్రేక్షకులు షాక్ అయ్యారు.

# ఈసీ సమగ్రతను దెబ్బతీస్తున్నారు

## కేంద్రంపై మల్లికార్జున ఖర్గే ఫైర్

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): పోలింగ్ బూత్‌లో ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేలా పర్మిషన్ ఇచ్చే నిబంధనల్లో ఎన్నికల సంఘం (%జుజ%)మార్పులు చేసింది. ఇకపై పోలింగ్‌కు సంబంధించి వెబ్‌క్యాస్టింగ్ రికార్డులను, సీసీటీవీ ఫుటేజ్‌లను, అలాగే అభ్యర్థులకు సంబంధించి వీడియో రికార్డింగ్‌లు చేయకుండా నిషేధం విధించింది. అయితే ఈసీ తీసుకున్న ఈ నిర్ణయంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ సమగ్రతను దెబ్బతీసేందుకు మోదీ ప్రభుత్వం పన్నిన కుట్రలో ఇదికూడా ఓ భాగమేనని మండిపడ్డారు.

" ఎన్నికల కమిషన్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రధాని మోదీ ఇంతకుముందు ఎన్నికల కమిషనర్లను నియమించే సెలక్షన్ ప్యానెల్ నుంచి భరత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. మళ్లీ ఇప్పుడు వాళ్లు చేసే కుట్రలు బయటకు రాకుండా ఉండేందుకు మార్పులు చేస్తున్నారు. ఓటర్ల పేర్లను తొలగించడం, ఈవీఎంలలో పారదర్శక లేకపోవడం లాంటి అక్రమాల గురించి మేము ఈసీకి చాలాసార్లు ఫిర్యాదు చేశాం. కానీ వాళ్లు స్పందించలేదు.

మళ్లీ ఇప్పుడు కేంద్రం చేసే కుట్రలు బయటపడనీయకుండా పోలింగ్‌కు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌ను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులు చెక్ చేయకుండా బ్యాన్ చేసింది. ఇలాంటివి చూస్తుంటే ఎన్నికల సంఘం తన స్వతంత్రతను కోల్పోతుందని స్పష్టమవుతోందని" ఖర్గే తెలిపారు. ఇదిలాఉండగా.. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల



నిర్వహణ రూల్స్-1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరణ చేసింది. పోలింగ్ బూత్‌లో సీసీటీవీ కెమెరాల తనిఖీ వల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని.. అందుకోసమే దీనిపై నిషేధం విధించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా ఫేక్ వీడియోలు తయారుచేస్తున్నారని చెప్పాయి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఇంటిపై దాడి... స్పందించిన అల్లు అరవింద్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని ఆయన తండ్రి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తీవ్రంగా ఖండించారు. బన్నీ ఇంటి దగ్గర ఆయన మీడియాతో మాట్లాడారు. అందరూ కాస్త ఓపికగా ఉండాలని పిలుపు నిచ్చారు అరవింద్. మా ఇంటి బయట జరిగిందంతా చూశారు. ప్రస్తుతం మేం కూడా సంయమనం పాటించాల్సిన సమయం. దేనికీ రియాక్ట్ కాకూడదు. దయచేసి ఎవరూ ఎలాంటి తొందరపాటు చర్యలకూ పాల్పడవద్దని అరవింద్ అభ్యర్థించారు.


**దయచేసి అర్థం చేసుకోండి..**

పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని తీసుకెళ్లారు. కేసు పెట్టారు. మళ్ళీ ఎవరైనా గొడవ చేయడానికి వస్తే అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని అల్లు అరవింద్ చెప్పారు. ఎవరు ఇలాంటి దుశ్చర్యలకు ప్రేరేపించకూడదని ఆయన కోరారు. ప్రస్తుతం అన్ని అంశాలు చాలా సున్నితంగా ఉన్నాయని...అందరూ దానిని అర్థం చేసుకోవాలని చెప్పారు.

అల్లు అర్జున్ ఇంటిపై దాడి జరిగింది. ఓయూ జేఏసీ అల్లు అర్జున్ ఇంటిని ముట్టడించింది. పలువురు జేఏసీ నాయకులు బన్నీ ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేశారు. బాడీగార్డ్‌లు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. వారిపై కొందరు తిరగబడ్డారు. అల్లు అర్జున్ వల్లే రేవతి చనిపోయిందంటూ వారు ఆరోపిస్తున్నారు. వెంటనే రేవతి కుటుంబానికి బన్నీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ కుటుంబానికి అన్ని విధాల ఆదుకోవాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు. ఇక విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకి చేరుకున్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు.

# బాల్య వివాహాలపై అస్సాం కఠిన చర్య

## మరో 416 మంది అరెస్టు




న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): అస్సాం ప్రభుత్వం బాల్య వివాహాలపై మరోసారి పంజా విసిరింది. గతంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన డ్రైవ్ మూడో దశలో భాగంగా 335 కేసులు నమోదవగా 416మంది అరెస్టు చేశారు. ఈ విషయాన్ని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తెలిపారు. అస్సాం ప్రభుత్వం బాల్య వివాహాలపై కఠిన చర్యలను కొనసాగిస్తుంది. అయితే గతంలో 2023లో ఫిబ్రవరి, అక్టోబర్‌లో రెండు దశల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఒక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ డ్రైవ్ మూడో దశలో భాగంగా డిసెంబర్ 21 రాత్రి నుంచి 22వరకు మొత్తం 335 కేసులు నమోదు చేసిన పోలీసులు 416మందిని అరెస్టుచేశారు. ఈ విషయాన్ని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని ఈరోజు కోర్టులో హాజరుపరచనున్నారు. ఇలాంటి సాంఘిక దురాచారాలను అంతం చేయడానికి సాహసోపేతమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎక్స్ పోస్టులో తెలిపారు.

**గతంలో..**

2023 ఫిబ్రవరిలో నిర్వహించిన మొదటి డ్రైవ్ లో.. 4,515 కేసులు నమోదు చేయగా.. 3,483 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత అక్టోబర్ రెండవ దశలో 710 కేసులు నమోదవగా..915 మందిని అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి శర్మా 2026లోపు దీన్ని ఆపేస్తానని రాజకీయంగా సవాల్ చేస్తున్నానని తెలిపారు.

**అరెస్ట్ వారెంట్ జారీ**

అలాగే ఈ విషయాన్ని బాధితుడు ఎవరికీ చెప్పకుండా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని ఈ కేసు వివరాలను బయటికి వెల్లడిస్తే తక్షణమే అదుపులోకి తీసుకుంటామంటూ బెదిరించారు. బాధితుడి పేరు మీద సుప్రీం ధర్మాసనం అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని నేరగాళ్లు భయాందోళనకు గురిచేశారు.

దీంతో బాధితుడు తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. వెంటనే స్పందించాడు. తాను ఏ తప్పూ చేయలేదని తనను కాపాడాలని అధికారుల ముసుగులో ఉన్న సైబర్ నేరగాళ్లను వేడుకున్నాడు. ఇక ఇదే అదునుగా భావించిన కేటుగాళ్లు.. తాము చెప్పిన విధంగా చేస్తే కేసు నుంచి తప్పించుకోవచ్చని బాధితున్ని నమ్మించారు. మొదట బాధితుడి బ్యాంకు అకౌంట్, బ్యాలెన్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తదనంతరం ఉన్నతాధికారులను మ్యానేజ్ చేయడానికి.. కేసు ఉపసంహరించుకోవడానికి రూ.15 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో వెంటనే నేరగాళ్లు అడిగిన రూ.15లక్షలు నగదును బాధితుడు వారి అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అక్కడితో నేరగాళ్లు ఆగలేదు. బాధితుడి బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌ను సైతం విత్ డ్రా చేయించారు. ఇక సరిగ్గా అదే సమయంలో బాధితుడి ఇంటికి బంధువులు రావడంతో విషయం తెలిసింది. వెంటనే అప్రమత్తమై పోలీసులను సంప్రదించారు. దీనిపై ఖమ్మం జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




### ప్రభుత్వమే సిగ్గులేకుండా

# ‘పుష్ప’ను ప్రోత్సహించింది

## పుష్పపై సీపీఐ నారాయణ ఫైర్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): ‘పుష్ప’ సినిమా వివాదంలో మొదట తెలంగాణ ప్రభుత్వానే పొరపాటు అని సీపీఐ నేత నారాయణ అన్నారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ చిత్రం బెనిఫిట్ షోలను నిర్వహించేందుకు పర్మిషన్ ఇవ్వడంతోపాటు టికెట్ ధరలు భారీగా పెంచేకునేలా ప్రోత్సహించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మీడియాతో మాట్లాడిన నారాయణ.. ‘పుష్ప2’ సంధ్య థియేటర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆమె కొడుకు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని కోరారు.

**స్మగ్లింగ్‌తో పాటు అసభ్యకరమైన పాటలు..**

ఈ సందర్భంగా ఓ వీడియోను విడుదల చేసిన ఆయన.. ‘పుష్ప’ చిత్రం ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసుకోవాలని సందేశం ఇస్తోందా? అని ప్రశ్నించారు. స్మగ్లింగ్‌తో పాటు అసభ్యకరమైన పాటలు అందులో ఉన్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం సిగ్గులేకుండా టికెట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చిందని మండిపడ్డారు. ‘అదేమైన సమాజానికి ఉపయోగపడే సినిమానా? ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహించాలి. దీనిలో పోలీసుల తప్పేం లేదు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్‌లో ఇలా జరగకుండా ఉండేందుకు సినిమా వర్గాలు, కళాకారులు, రాజకీయ నేతలు చర్యలు చేపట్టాలి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. త్వరలో మా వంతు సాయం ప్రకటిస్తాం’ అని అన్నారు.

**జగపతి బాబు సానుభూతి..**

ఇదిలా ఉంటే సీనియర్ నటుడు జగపతి బాబు ఈ ఘటనపై స్పందించారు. ‘సినిమా షూటింగ్ ముగించుకుని నేను ఊరి నుంచి రాగానే.. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు హాస్పిటల్‌కు వెళ్లా. చికిత్స పొందుతున్న బాలుడి తండ్రిని, సోదరిని పలకరించాలని అనిపించి అక్కడకు వెళ్లా.అందరి ఆశీస్సులతో త్వరగానే కోలుకుంటాడని వారికి భరోసా ఇచ్చా. అందరికంటే ఎక్కువ ఎఫెక్ట్ అయింది ఆ కుటుంబం కాబట్టి నా వంతు సపోర్టు ఇవ్వాలనుకున్నా. దానికి పబ్లిసిటీ చేయలేదు. అందుకే ఎవరికీ ఆ విషయం తెలియలేదు. దానిపై క్లారిటీ ఇవ్వడానికే ఈ పోస్టు..’ అని పేర్కొన్నారు. పుష్ప 2’ ప్రీమియర్ షో చూసేందుకు హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన్ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంబంధిత కేసులో అల్లు అర్జున్ ఇటీవల అరెస్టు అయి బెయిల్‌పై విడుదలయ్యారు. పలువురు సినీ ప్రముఖులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కాగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సినీ ప్రముఖుల్లో జగపతి బాబు మొదటి వ్యక్తి కావడం గమనార్హం.



# సైబర్ నేరాల్లో రూ.297 కోట్లు పోగొట్టుకున్న బాధితులు: సీవీ ఆనంద్

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది సైబర్ నేరాలకు గురైన బాధితులు రూ.297 కోట్లు పోగొట్టుకున్నారని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. చాలామంది పరువు పోతుందని ఫిర్యాదు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదని చెప్పారు. హైదరాబాద్ కమిషనరేట్ వార్షిక మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. డయల్ 100కి వస్తున్న ఫిర్యాదులపై స్పందన పెరిగింది. ఫిర్యాదులు వచ్చిన తర్వాత ఘటనాస్థలానికి వెళ్లే సమయం కూడా బాగా తగ్గింది. రాత్రిపూట కూడా పోలీసుల గస్తీ పెంచాం. ధ్వని కాలుష్యంపై తాము తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మద్దతు వస్తోంది. డిజే సౌండ్‌లపై పలుసార్లు కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయి. గతేడాదితో పోల్చి చూస్తే ఈసారి 45 శాతం ఎఫ్ఐఆర్‌లు పెరిగాయి. పెరిగిన వాటిలో చిన్నచిన్న చోరీలు, యాక్సిడెంట్ కేసులున్నాయి. గతంలో చిన్న ఫిర్యాదులు వచ్చినప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేది కాదు. ఇప్పుడు ప్రతీ చిన్న నేరానికి ఎఫ్ఐఆర్ నమోదైంది. అందుకే కేసుల సంఖ్య పెరిగింది. ఇక కిడ్నాప్ కేసులు 85 శాతం పెరిగాయి. సెల్‌ఫోన్ల చోరీల సంఖ్య కూడా పెరిగింది.

సైబర్ నేరాల వలలో పడి కేటుగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్నవాళ్ల సంఖ్య పెరుగుతోంది. ప్రజల్లో ఎంత అవగాహన కల్పించినా కూడా మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉన్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు అనగానే చాలామంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. పెట్టుబడుల విషయంలో కూడా చాలామంది మోసపోతున్నారు.

గతేడాది కంటే ఈసారి 91 శాతం ఎక్కువగా డబ్బులు పోగొట్టుకున్నారు. కరెంట్ ఖాతాల నుంచే సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయి. ఎలాంటి విచారణ లేకుండానే కొందరికి బ్యాంక్ సిబ్బంది కరెంట్ ఖాతాలు ఇస్తున్నారు. అంతేకాదు కొందరు బ్యాంకు సిబ్బంది సైబర్ నేరగాళ్లకు కూడా సహకరిస్తున్నారని” సీవీ ఆనంద్ చెప్పారు.

# తెలంగాణలో డిజిటల్ అరెస్ట్

## రూ.15 లక్షలు ఫసక్!

### సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ.7.50 లక్షలు పోగొట్టుకున్న యువతి



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సంపన్నులు, రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులనే టార్గెట్‌గా పెట్టుకుంటున్నారు. గాలమేసి డబ్బులు కొట్టేస్తున్నారు. ఈ మధ్య డిజిటల్ అరెస్టు అంటూ చెలరేగి పోతున్నారు. బాధితులకు లక్షల్లో కుచ్చిటోపి పెడుతున్నారు. తాజాగా అలాంటిదే మరొకటి జరిగింది. తెలంగాణలో డిజిటల్ అరెస్ట్ వెలుగులోకి వచ్చింది. ఓ బాధితుడు కేటుగాళ్ల వలలో పడి సుమారు రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే..

**సైబర్ కేటుగాళ్ల నుంచి ఫోన్ కాల్**

ఖమ్మం జిల్లా వైరాకు చెందిన ఓ వ్యక్తికి సైబర్ కేటుగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ పేరు మీద శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వేర్వేరు ప్రాంతాలకు ఐదు టికెట్లు బుక్ అయ్యాయని బాధితుడికి అవతల వ్యక్తి తెలిపాడు. అంతేకాకుండా ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాలకు టికెట్ ఎందుకు బుక్ చేసుకున్నారంటూ వరుస ప్రశ్నలు అడిగాడు.

ఇది కూడా చదవండి: ఏపీకి రండి.. సినీ పెద్దలకు పవన్ కళ్యాణ్ పిలుపు!


మనీ లాండరింగ్ జరిగిందంటూ అయితే తాను ఎక్కడికీ టికెట్ బుక్ చేయలేదని బాధితుడు చెప్పాడు. అనంతరం ఆ కేటుగాడు బాధితుడి వాట్సాప్ నెంబర్‌కు వీడియో కాల్ చేశాడు. తాము సీబీఐ అధికారులమంటూ వీడియో కాల్ ద్వారా బాధితున్ని నమ్మించాడు. ఆపై మీ పేరు మీద ఢిల్లీలో అకౌంట్ ఉందని హవాలా, మనీ లాండరింగ్, డ్రగ్స్ లావాదేవీలన్నీ సదరు అకౌంట్ నుంచి జరుగుతున్నట్లు గుర్తించామని సైబర్ నేరగాళ్లు బాధితుడికి చెప్పి భయపెట్టారు.

అక్కడితో ఆగకుండా ఇదే కేసుకు సంబంధించి ఓ వ్యక్తిని సైతం అరెస్ట్ చేశామని మరింత చెమటలు పట్టించారు. అరెస్టు చేసిన వ్యక్తి వద్ద నుంచి లభించిన కీలక డాక్యుమెంట్స్ ఆధారంగా మిమ్మల్ని విచారిస్తున్నామని బాధితుడిని వణికించారు. సదరు కేసు రిపోర్ట్స్ ను కూడా వాట్సాప్ లో పంపించి బాధితుడిని భయాందోళనకు గురిచేశారు.

# టిక్‌టాక్‌కు వరుస షాక్‌లు

## అల్బేనియాలోనూ నిషేధం..!

### యాప్‌లో చెత్త మాత్రమే కనిపిస్తుందని ప్రధాని..!




హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): టిక్‌టాక్‌కు మరో షాక్ తగిలింది. ఈ చైనీస్ యాప్‌ను అల్బేనియా సైతం నిషేధించింది. ఆ యాప్‌లో అంతా బురద, చెత్త మాత్రమే కనిపిస్తుందని ఆ దేశ ప్రధానమంత్రి ఈడీ రామా పేర్కొన్నారు. టిక్‌టాక్‌ను కనీసం 2025 నుంచి సంవత్సరం నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం ఈడీ రామా టిరానాలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సైకాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఏడాది పాటు ఈ యాప్‌ను బ్యాన్ వదించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఓ కార్యక్రమాన్ని సైతం ప్రారంభించనున్నది. దాంతో తల్లిదండ్రులకు చేయతనిచ్చేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. చైనాలో పాఠ్యాంశాలు, విద్య సంబంధిత కార్యక్రమాల కోసం టిక్‌టాక్‌ని ఉపయోగిస్తున్నారన్నారు. అయితే, చైనా వెలుపల మనకు టిక్‌టాక్‌లో అంతా బురద, చెత్త మాత్రమే మనకు కనిపిస్తుందన్నారు. ఆ యాప్ అవసరం మనకు ఎందుకు? అని ప్రశ్నించారు. ఇది పిల్లలకే కాదని.. మొత్తం సమాజానికి సంబంధించిన సమస్య అని పేర్కొన్నారు. ఇటీవల, టిరానాలో సోషల్ మీడియా ఘర్షణలో 14 ఏళ్ల విద్యార్థి మరణించాడు. ఈ క్రమంలో సోషల్ నెట్‌వర్కింగ్ యాప్‌ను బ్లాక్ చేయడానికి చర్య చేపట్టారు. ఆ తర్వాత సోషల్ నెట్‌వర్కింగ్ ప్రభావంపై దేశంలో చర్చ ప్రారంభమైంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే టిక్‌టాన్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు నిషేధించాయి. ఇందులో భారత్ సైతం ఉన్నది. టిక్‌టాక్‌తో సహా చైనాకు చెందిన 58 యాప్‌లను 2020లో భారత్ నిషేధించింది. అలాగే, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇండోనేషియా, కిర్గిస్థాన్, ఆస్ట్రేలియా, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్, బెల్జియం, డెన్మార్క్, కెనడా, న్యూజిలాండ్, తైవాన్, మాల్టా, ఫ్రాన్స్, నార్వే, లాట్వియా సైతం టిక్‌టాక్‌ను నిషేధించాయి. ఇప్పటికే అమెరికాలో యాప్‌ను నిషేధించాలని చట్టసభ్యులు డిమాండ్ చేశారు. భారతీయ-అమెరికన్ రాజా కృష్ణమూర్తితో సహా ఇద్దరు యూఎస్ చట్టసభ సభ్యులు వచ్చే వారం టిక్‌టాక్‌ను యాప్ స్టోర్‌ల నుండి తొలగించాలని ఆపిల్, గూగుల్ సంస్థలను కోరారు.



# ఆసీస్ మీడియా నోటి దురద..

## కోహ్లీపై అక్కసు

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు): నాలుగో టెస్ట్ కోసం కోహ్లీ మెల్ బోర్న్ చేరుకున్నాడు. ఈ క్రమంలో ఈ క్రమంలో తీవ్ర పదజాలంతో కోహ్లీపై ఆస్ట్రేలియాకు చెందిన మీడియా హెడ్‌లైన్‌లు పెడుతూ... అనవసరంగా నోటి దురుసును బయటపెట్టుకుంటోంది.

**అసలేమైంది..**

రెండు రోజల క్రితం విరాట్కోహ్లీ మెల్‌బోర్న్ చేరుకున్నాడు. అతను ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు వస్తుండగా ఆస్ట్రేలియా మీడియాకు చెందిన ఒక మహిళ విరాట్ అనుమతి లేకుండా అతని పిల్లల ఫోటోలను తీశాడు. దీనిపై కోహ్లీ అక్కడే కోపం వ్యక్తం చేశాడు. ఎంత సెలబ్రిటీలం అయినా కూడా మాకు ప్రైవసీ ఉంటుంది కదా అంటూ ఆ రిపోర్టర్ కు గట్టిగా చెప్పాడు దీనికి సంబంధించిన వీడియో బాగా వైరల్ అయింది. ఇప్పుడు ఇదే విషంపై ఆసీస్ మీడియా అక్కసు వెళ్ళగక్కుకుంటోంది. నైన్ స్పోర్ట్స్ రిపోర్టర్ టోనీ జోన్స్ ఈ విషయం గురించి మాట్లాడుతూ..విరాట్ కోహ్లీ మీ ధోరణి సరిగ్గా లేదు. అలా ప్రవర్తించడం సరికాదు. సదరు మహిళా జర్నలిస్ట్ ఒక కెమెరామెన్‌తో ఉన్నారు. రోజూ నిర్వర్తించే బాధ్యతల్లో భాగంగా ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నారు. అక్కడికి రాజకీయ నాయకులు, క్రీడాకారులు ఎవరైనా సరే గుర్తింపు కలిగిన వారు వస్తుంటారు. మీరు అక్కడికి రావడంతో కెమెరాలు మీవైపు తిప్పారు. ఎంత మీరు గుర్తింపు కలిగిన బ్యాటర్ అయితే మాత్రం ఇలా ప్రవర్తిస్తారా అంటూ కామెంట్ చేశారు. నిజానికి విరాట్ చేసింది ఏమీ తప్పు కాదు. తని అనుమతి లేకుండా కుటుంబ వ్యక్తులు ఫోటోలు తీయడం వాళ్ళ తప్పు. అదేదో క్యాజువల్‌గా చేసింది కాదు. కానీ ఆస్ట్రేలియా మీడియా మాత్రం తమ వారినే వెనకేసుకుని వచ్చింది.

అసలు ఆస్ట్రేలియా మీడియాకు భారత క్రికెటర్లపై ఏదో ఒకటి రాయడం లేదా కామెంట్ చేయడం ఇదేం మొదటిసారి కాదు. ఎన్నో ఏళ్ళుగా ఇది సాగుతూనే ఉంది. అందులోనూ విరాట్ కోహ్లీ గురించి అయితే ఇంకాను. ఇప్పుడు జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభానికి ముందు కూడా కోహ్లీని తక్కువ చేస్తూ కథనాలు వెలువడ్డాయి. సూపర్ స్టార్ అని చెబుతూనే అతనిని తక్కువ చేస్తూ రాశాయి. మెల్‌బోర్న్‌లో విరాట్‌కు మంచి రికార్డు ఉంది. అయితే ప్రస్తుతం ఈ సీరీస్ లో కోహ్లీ ఏమంతగా ఆడటం లేదు. మొత్తం టీమే సరిగ్గా పెర్ఫామ్ చేయడం లేదు. ఇప్పుడు మెల్‌బోర్న్ టోర్నీలో కనుక ఆడితే.. ఈమ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు సిరీస్‌ను కోల్పోయే అవకాశం లేకుండా ఉండటం తోపాటు ఆధిక్యంలోకి దూసుకెళ్తుంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సంపాదకీయం EDITORIAL

## సినీ ప్రముఖుల ఇండ్లపై దాడిని ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి






హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సినీ ప్రముఖుల ఇండ్లపై దాడి చేయడాన్ని సీఎం సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు. రాష్ట్రంలోనూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌లను ఆదేశిస్తున్నట్లు ఆదివారం 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)'లో చేసిన పోస్టులో తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. అలాగే సంధ్య థియేటర్ ఘటన విషయంలో సంబంధం లేని పోలీసులు స్పందించవద్దని పేర్కొన్నారు. ఇతర సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొందరు ఓయూ జేఏసీ నాయకులు జుబ్లీ హిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.

# అడవుల రక్షణ బాధ్యత ఆదివాసీలదేనా?

**దేశ వనరులను కాపాడాల్సిన బాధ్యత కేవలం ఆదివాసులదే కాదు, మిగతా వారిపై కూడా ఉంది. సహజ వనరులను కాపాడే క్రమంలో ఆదివాసీల జీవితాలు బలవుతున్నాయి. బీర్సాముండా, గుండాదర్, కుమ్రం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగంలో ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ 1/70, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలు రూపుదిద్దుకున్నాయి.**



దేశ వనరులను కాపాడాల్సిన బాధ్యత కేవలం ఆదివాసులదే కాదు, మిగతా వారిపై కూడా ఉంది. సహజ వనరులను కాపాడే క్రమంలో ఆదివాసీల జీవితాలు బలవుతున్నాయి. బీర్సాముండా, గుండాదర్, కుమ్రం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగంలో ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ 1/70, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఆదివాసీల అభ్యున్నతే వీటి లక్ష్యం. కానీ, పాలకులు ఆ చట్టాలను అమలు చేయడం లేదు.

కొద్ది నెలలుగా మధ్య భారతదేశంలో, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల మీద పెద్దఎత్తున అణచివేత కొనసాగుతున్నది. ఆదివాసీ గూడెంల సమీపంలో వందలాది పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసి వారిని ఆందోళనకు గురిచేస్తున్నారు. మూలవాసీ బచావో మంచ్ నాయకుడు రఘు మాటల్లో ఈ దేశ వనరులను కాపాడేందుకు ఆదివాసులు చేస్తున్న పోరాటాన్ని మిగతా సమాజం పట్టించుకోవడం లేదు. ఇది ఆదివాసీలకు సంబంధించిన సమస్యగా అందరూ చూస్తున్నారు. 1980 నుంచి మావోయిస్టులు ఆదివాసీ సమాజంలోకి, దండకారణ్యంలోకి ప్రవేశించి అక్కడ జరిగే అమానుషం, ఫారెస్టు వాళ్ల దోపిడీలను అరికట్టడం కోసం కృషి చేశారు. కానీ, 1993లో ప్రత్యేక చట్టం వచ్చాక దండకారణ్యంలోని కోట్లాది విలువైన వనరులపై కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారుల కన్నుపడింది.

వనరుల దోపిడీకి ఆదివాసుల భూములను ఆక్రమించేందుకు నాటి నుంచి నేటి వరకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆదివాసీలకు మావోయిస్టులు మద్దతుగా ఉన్నందుకే 2005లో సల్వాజుడుం మారణ హోమాన్ని సృష్టించారు. ఐదేండ్లలో మూడు వేల గ్రామాలను దగ్ధం చేశారు. 450 మందిని అతి కిరాతకంగా హత్య చేశారు. ఆ క్రమంలోనే ఎర్రబోరు, దోర్నపాలు, కుంట ప్రాంతాల్లో సల్వాజుడుం బేస్ క్యాంప్‌లుగా మార్చి ఒక్కొక్క క్యాంపులో 50 వేలకు పైగా ఆదివాసీలను నిర్బంధించిన స్థితిని మనందరం చూశాం. చివరికి ప్రొఫెసర్ నందిని సుందర్ పోరాటం, జస్టిస్ సుదర్శన్ తీర్పు కారణంగా సల్వాజుడుం రద్దయిందేమో కానీ, దాని మరొక రూపం డీఆర్‌జీ నేటికీ వేటాడుతూనే ఉన్నది.

ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడినందుకు సునీత పొట్టం అనే ఆదివాసీ, మూలవాసీ బచావో మంచ్ నాయకురాలిని బలవంతంగా అరెస్టు చేశారు. అదేవిధంగా 2021 నుంచి సిలింగేర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాయుధ బలగాల క్యాంపులకు వ్యతిరేకంగా మూలవాసీ బచావో మంచ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఆదివాసులందరూ మావోయిస్టులేననే దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రభుత్వం చేస్తున్నది. ఈ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లు, ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడుతున్న హక్కుల నేతలను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు. ఆదివాసీల సమస్యల గురించి ఎవరూ మాట్లాడొద్దా?

ఇదే విధంగా సోనిసూరీ అనే ఆదివాసీ హక్కుల కార్యకర్తను నిర్బంధించారు. చనిపోయిన భర్తను చూసేందుకు కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతను అణచివేస్తున్నారు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో కగార్ మారణకాండ కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్నాయి. ప్రభుత్వాలే దళారీగా మారి పెట్టుబడిదారులకు సహజ వనరులను అప్పగించడం దారుణం.

2009లో మావోయిస్టు పార్టీ దేశానికి ప్రమాదకరమని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. చెప్పినట్టే ఏకపక్ష దాడులకు దిగారు. సరిహద్దుల్లో ఉండాల్సిన సాయుధ బలగాలు మధ్యభారతంలోకి ప్రవేశించాయి. అదే ఇప్పుడు ఆపరేషన్ కగార్‌గా మారింది. ఇప్పుడు దంతెవాడ, బస్తర్ ప్రాంతాలతో పాటు బీజాపూర్ జిల్లా కూడా ఇనుప ఖనిజపు పుట్టినిల్లుగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు ఒక స్టీల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం 2005లో ఒప్పందం కుదుర్చుకున్నది. దానికి తోడు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు పనిచేస్తున్నది. కంపెనీలతో జరిగిన ఒప్పందాల వల్లనే ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతున్నది. తద్వారా ప్రజలను చంపైనా సరే వనరులను అప్పగించాలనే స్థితికి ప్రభుత్వాలు చేరిపోయాయి.

ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తున్నందున వాటిని అణచివేసేందుకు అనేక రకాల ఆపరేషన్లు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఆదివాసీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్, 2017లో ఆపరేషన్ సమాధాన్, నేడు ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల హత్యాకాండ కొనసాగుతున్నది. వేలాది మంది ఆదివాసీలు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఏడాది జనవరి 1న బీజాపూర్ జిల్లా ముగ్దుం గ్రామానికి చెందిన 6 నెలల సోడి మంగ్లీతో మొదలైన హత్యాకాండ 275కు చేరింది. తెలంగాణలోనూ సెప్టెంబర్ 5న రఘునాథపాలెంలో ఏడుగురిని హతమార్చారు. డిసెంబర్ 1న ఆరుగురికి విషం పెట్టి మరీ కాల్చిచంపారు. కనీసం ఆ మరణాలపై సత్యశోధన చేయడానికి కూడా ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం లేదు.

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నిషేధిత ప్రాంతంగా మారిపోయింది. హక్కుల సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదు. ఎమర్జెన్సీ కాలంలోనూ ఇంతటి దారుణమైన పరిస్థితి లేదు. అందుకే ప్రజలు స్పందించాలని కురుసం శంకర్, రఘు లాంటి మేధావులు కోరుతున్నారు.

ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేతలు ఎన్నడికీ విజయవంతం కావు. తెలంగాణ ఉద్యమమే అందుకు నిదర్శనం. మావోయిస్టుల సాకుతో ఆదివాసీలను నిర్బంధిస్తే ఉద్యమాలు ఆగవు. ప్రజాస్వామిక పోరాటాలను నిషేధించిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించవు. పాలించే నైతిక హక్కును పాలకులు కోల్పోతారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. మూలవాసీ బచావో మంచ్‌పై నిషేధం ఎత్తివేయాలి. మరీ ముఖ్యంగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది.

ఆదివాసీలపై చేస్తున్న హత్యాకాండ పట్ల ప్రజల నుంచి మద్దతు దక్కని పక్షంలోనే ప్రభుత్వాలు అత్యంత దారుణంగా నరమేధాన్ని సృష్టిస్తాయి. ఈ విధానాన్ని మనమంతా ఖండించాలి. దేశ మూలవాసులైన ఆదివాసుల జీవించే హక్కును కాపాడుదాం. ఆపరేషన్ కగార్, ఆదివాసీ హననానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం.

# అమెరికాలో భారతీయం

అమెరికాలో భారతీయుల జనాభా 50 లక్షలు దాటిపోయింది. అమెరికా జనాభాలో ఇది సుమారు ఒకటిన్నర శాతం. చేసే పని పట్ల క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ఈ పెరుగుదలకు కారణమైందని చెప్పవచ్చు. ఈ పరిమాణాత్మకమైన మార్పు గుణాత్మకమైన మార్పుగా పరిణమిస్తుండటం విశేషం. ఉద్యోగ, వ్యాపార రంగాలే కాకుండా అమెరికా ప్రధాన స్రవంతి రాజకీయాల్లోనూ పెరుగుతున్న భారతీయుల ప్రాబల్యమే ఇందుకు నిదర్శనం. ఈ దృష్టితో గమనిస్తే ఇటీవల జరిగిన అమెరికా ఎన్నికలు చరిత్రాత్మకమైనవే కాదు, భారతీయతకు సంబంధిం చి చాలా రకాలుగా ప్రాముఖ్యం కలవిగా చెప్పుకోవచ్చు. ఈ ఏడాది విడుదలైన 'ఇండియన్ జీనియస్: ది మిటియోరిక్ రైజ్ ఆఫ్ ఇండియన్స్ ఇన్ అమెరికా' వంటి పుస్తకాలు ఈ అభ్యున్నతికి అద్దం పడుతున్నాయి. భారతీయ మూలాలున్న కమలా హ్యారిస్ అత్యున్నత పదవికి పోటీ పడటం, హోరాహోరీగా పోరాడి ఓడిపోవడం ఓ చరిత్ర. మరెందరో భారత సంతతి వ్యక్తుల పేర్లు ఎన్నికలకు ముందు, తర్వాత ప్రముఖంగా ముందుకురావడం విశేషం. మారుతున్న అమెరికా రాజకీయ ముఖచిత్రాన్ని ఇది సూచిస్తున్నది.

రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్ కొత్త ప్రభుత్వం కోసం జరుపుతున్న నియామకాల్లో భారతీయులకు సింహభాగం దక్కుతుండటం విశేషం. రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వివేక్ రామస్వామి కీలక పదవిలో నియమితులయ్యారు. ప్రభుత్వ నిర్వహణా వ్యయం తగ్గింపు కోసం ఏర్పాటు చేస్తున్న కమిషన్‌లో ఆయన పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్‌తో పాటు బాధ్యతలు పంచుకోబోతున్నారు. ఆంతరంగిక భద్రతా సంస్థ ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాశ్ పటేల్ పేరు ట్రంప్ ప్రకటించారు. జయ్ భట్టాచార్య జాతీయ ఆరోగ్య సంస్థల డైరెక్టర్ పదవి దక్కించుకున్నారు. హర్మీత్ ధిల్లోన్ న్యాయశాఖలోని పౌరహక్కుల విభాగం అధిపతి కాబోతున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాన్స్ సతీమణి భారతీయ సంతతికి చెందిన వ్యక్తి అన్నది తెలిసిందే. అవకాశాలు కలిసి వస్తే ఆమె ప్రథమ మహిళ స్థానాన్నీ ఆక్రమించవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ట్రంప్ ప్రభుత్వంపై భారతీయ ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

భారతీయతతో మాత్రమే కాకుండా భారతదేశంతో ట్రంప్‌కు ప్రత్యేక రాజకీయ అనుబంధం ఉన్నది. గత అధ్యక్ష ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ అసాధారణమైన రీతిలో ట్రంప్‌తో రాజకీయ ర్యాలీ జరిపారు. కానీ, ట్రంప్ ఓటమితో ఆ ప్రయత్నమంతా నిరర్థకమైపోయింది. వ్యక్తిగత స్థాయిలో సాన్నిహిత్యం మాత్రం పెరిగింది. మొన్న గెలిచిన తర్వాత ట్రంప్ ఆ సంగతి పదే పదే ప్రస్తావించడం గమనార్హం. బుష్ హయాంలో అమెరికా-భారత్ అణు ఒప్పందం కుదరడం వెనుక భారత సంతతి ప్రముఖుల కృషి ఉన్నదని ఇప్పటికీ చెప్పుకొంటారు. ఇప్పుడు అక్కడి భారతీయం పైపైకి ఎగబాకింది. పలుకుబడి మిన్నంటింది. కానీ రెండు దేశాల సంబంధాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. దిగుమతి సుంకాలు, డాలరు మారకం, తదితర అంశాల్లో పొరపొచ్చాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారంలో భారత సంతతి అమెరికన్లు ఏ మాత్రం సహాయకార్ పాత్ర పోషించినా రెండు దేశాల సంబంధాలకు ఎంతో దోహదంచేసినవారవుతారు.





## భీకర దాడులతో అమెరికా రివెంజ్ ఎటాక్

### హౌతీల స్థావరాలే టార్గెట్

**ఇజ్రాయెల్‌పై ప్రాజెక్టైల్ క్షిపణులతో హౌతీ రెబల్స్ ఎటాక్**

**మిత్రదేశానికి అండగా ప్రతీకార దాడులకు దిగిన అమెరికా!**

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య ప్రారంభమైన పోరు క్రమంగా విస్తరిస్తోంది. రోజుకో దాడి, ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. శనివారం హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌పై క్షిపణులు ప్రయోగించగా, అమెరికా ప్రతీకార దాడులు చేసింది. యెమెన్ రాజధానిలోని హౌతీల స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసినట్లు అగ్రరాజ్యం పేర్కొంది.

"హౌతీల కార్యకలపాలు దెబ్బతినేలా దాడులు నిర్వహించాం. ఎర్ర సముద్రం, బాబ్ అల్ మాండెబ్, ఏడెన్ గల్ఫ్‌లో వ్యాపార నౌకలపై దాడులు చేశాం. హౌతీ రెబల్స్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే దీని లక్ష్యం" అని అమెరికా మిలిటరీ అధికారులు తెలిపారు.

**యెమెన్‌పై ఇజ్రాయెల్ ఎటాక్**

మరోవైపు గత గురువారం యెమెన్‌పై ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు చేశాయి. ఈ దాడులు హౌతీల సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని జరిపినట్లు ఇజ్రాయెల్ దళాలు పేర్కొన్నారు. దీనికి ప్రతీకారంగా హౌతీ రెబల్స్ శనివారం ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌పై ప్రొజక్టైల్ క్షిపణులను ప్రయోగించారు. అయితే వీటిని అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ సైన్యం విఫలమైంది. ఫలితంగా 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిని రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేకపోవడంపై టెల్‌అవీవ్ విచారణకు ఆదేశించింది. టెల్‌అవీవ్‌పై హౌతీలు దాడులు చేసిన కొన్ని గంటల్లోనే, ఇజ్రాయెల్ మిత్రదేశమైన అమెరికా ప్రతీకార దాడులు చేయడం గమనార్హం.

గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. వీరికి ఇరాన్ మద్దతిస్తూ వస్తోంది. తాము పాలస్తీనియన్లకు సంఘీభావంగా వ్యవహరిస్తున్నామని హౌతీ తిరుగుబాటుదారులు పేర్కొంటున్నారు. గాజాపై యుద్ధాన్ని ఆపే వరకు ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగిస్తామని వారు చెబుతున్నారు. దీంతో హౌతీల సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ మిలిటరీ దళాలు దాడులు చేస్తున్నాయి.

**సొంత యుద్ధవిమానంపైనే కాల్పులు!**

కాగా, ఎర్ర సముద్రంలోని పెట్రోలింగ్ ఏరియాలో ఓ అమెరికా యుద్ధ విమానం పొరపాటున, తమ దేశానికే చెందిన మరో మిలటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌పై కాల్పులు జరిపి, దానిని పడగొట్టింది. 'యూఎస్ మిలటరీకి చెందిన గైడెడ్ మిస్సైల్ క్రూయిజర్ ఎయిర్‌క్రాఫ్ట్ - %ఖీ/ూ%-18 ఎయిర్‌క్రాఫ్ట్‌పై పొరపాటున కాల్పులు జరిపింది. దీనితో సదరు %ఖీ/ూ%-18 కూలిపోయింది. అయితే అందులోని ఇద్దరు పైలట్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు' అని యూఎస్ మిలటరీ తెలిపింది. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు పేర్కొంది.

## అణ్వస్త్ర ప్రమాదం

ప్రపంచవ్యాప్తంగా ఆయుధ పోటీ క్రమంగా పెరుగుతుండటం ఆందోళనకరం. ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేసిన దీర్ఘకాలిక క్షిపణులు రష్యా భూభాగంపై ప్రయోగించేందుకు అనుమతిస్తూ అధ్యక్షుడు జో బైడెన్ ఇటీవల ఫర్మానా జారీచేయడంతో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. ఆ వెనువెంటనే ఉక్రెయిన్ కొన్ని క్షిపణులను రష్యాపై వేసింది కూడా. దీన్ని అమెరికా ప్రత్యక్ష దాడిగా భావిస్తామని, అణ్వస్త్ర వినియోగ విధానంలో మార్పులు చేస్తామని రష్యా వెల్లడించడం ఓ ప్రమాదకరమైన మలుపు. దీంతో అణ్వస్త్ర ముప్పు మరోసారి తెరమీదకు వచ్చింది. అణ్వస్త్ర పరిమితి ఒప్పందాలను తాము ఖాతరు చేయబోమని, అవి కాలగర్భంలో కలిసిపోయినట్టేనని రష్యా సైనికదళాల ప్రధానాధికారి జనరల్ వాలెరీ గెరాసిమోవ్ తేల్చిచెప్పడం గమనార్హం. పాశ్చాత్య ప్రపంచంపై నమ్మకం సన్నగిల్లడమే ఇందుకు కారణమని ఆయన తేల్చి చెబుతున్నారు. 2002లో విధ్వంసక క్షిపణుల ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంతో అగ్రరాజ్యాల మధ్య ఆయుధ పోటీకి బీజం పడింది. అప్పటినుంచి ఒకదాని తర్వాత ఒకటిగా ఆయుధ పరిమితి ఒప్పందాలన్నీ కుప్పకూలుతూ వచ్చాయి. చివరగా మిగిలిన వ్యూహాత్మక ఆయుధ పరిమితి ఒప్పందం గడువు 2026 ఫిబ్రవరిలో ముగిసిపోతుంది. అంటే గత 50 సంవత్సరాల చరిత్రలో బడా అణ్వస్త్ర దేశాల మధ్య ఎలాంటి ఒప్పందాలు లేని పరిస్థితిని ప్రపంచం ఎదుర్కోబోతున్నది. రష్యా చేసిన ప్రకటనతో అది అంతకంటే ముందే జరిగిపోతుందేమోననే భయాలు వెంటాడుతున్నాయి. నేటిరోజుల్లో అణ్వస్త్ర సమస్య అనేది అమెరికా రష్యాలకే పరిమితం కాలేదు. చైనా కూడా ఆయుధపోటీలోకి దూకుడుగా దిగడంతో పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. ఈ సరికే చైనా 500 అణ్వస్త్రాలు పోగేసుకున్నట్టు ఒక లెక్క. దశాబ్దం చివరి నాటికి ఆ సంఖ్యను వెయ్యికి, 2035 నాటికి అమెరికా, రష్యాలతో సమానంగా 1,500కు పెంచాలని చూస్తున్నది. దీనివల్ల అణ్వాయుధ పరిమితి చర్చల్లో పాల్గొనాల్సిన దేశాల సంఖ్య రెండు నుంచి మూడుకు పెరుగుతుంది. అణ్వస్త్రాల సమస్య భారత్ తలుపు తడుతున్న సూచనలూ కనిపిస్తున్నాయి. పొరుగున ఉన్న పాక్, చైనాలు ప్రకటిత అణ్వస్త్ర దేశాలు. ఇటీవల బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజా తిరుగుబాటు ఫలితంగా షేక్ హసీనా ప్రధాని పదవి కోల్పోయి దేశం వదిలి పారిపోయిన తర్వాత భారత వ్యతిరేక శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత సెప్టెంబర్‌లో షహీదుజ్జమాన్ అనే వివాదాస్పద ప్రొఫెసర్ బంగ్లా-పాక్ మధ్య అణ్వస్త్ర రక్షణ ఒప్పందం కుదిరితే బాగుంటుందని చేసిన సూచన సంచలనం కలిగించింది. సాధ్యాసాధ్యాల సంగతి అటుంచితే ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. అణుయుద్ధం ఎప్పుడు, ఎవరి మధ్యన జరిగినా విజేతలంటూ ఎవరూ మిగలరనేది నిర్వివాదాంశం. మూడు దశాబ్దాలుగా ఒప్పందాలు కలిగించిన భరోసా అంతమైపోతున్నది. 1962లో క్యూబా సంక్షోభం తర్వాత మళ్లీ అణ్వస్త్రాల ఉపయోగం గురించిన మాటలు వినవస్తున్నాయి. ఇది ఎటు దారితీస్తుంది!

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215